సాక్షి రంగారెడ్డి

సోమవారం ♦ 7 ♦ ఆగస్టు ♦ 2023



బాధితుల అరెస్టు దారుణం

మా భూమి మాకే కావాలని దీక్ష చేస్తున్న దళితులను అరెస్ట్ చేయడం దారుణమని పీసీసీ ప్రధాన కార్యదర్శి పారిజాత అన్నారు. 8లో▸



పేదలకు అండగా ఉంటా

నియోజవకర్గంలోని పేద ప్రజలకు అండగా ఉంటానని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేష్ పేర్కొన్నారు. 8లో▸



సమస్యలకు నిలయంగా..

శంకర్‌పల్లి కస్తూర్బా గాంధీ పాఠశాల సమస్యలకు నిలయంగా మారడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. 8లో▸

న్యూస్‌రీల్

ప్రజారోగ్యమే ముఖ్యం

చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి



ప్రొఫెసర్ జయశంకర్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

శంకర్‌పల్లి: రాజకీయాలు ముఖ్యం కాదని, ప్రజారోగ్యమే ముఖ్యమని చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని జనవాడ గ్రామంలో ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి ఆరోగ్య రథాన్ని ప్రారంభించారు. అంతకుముందు ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా సేవ చేస్తానని అన్నారు. ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఆరోగ్యానికి మించిన సంపద లేదని పేర్కొన్నారు. ఆరోగ్య రథంలో ప్రజలకు అన్ని పరీక్షలు నిర్వహించడంతో పాటు మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు. స్థానికుల విన్నపం మేరకు ఎమ్మెల్యే.. జనవాడ గ్రామంలో ప్రభుత్వ ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని మంత్రి హరీశ్‌రావుకు ఫోన్ చేసి కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ గోవిందమ్మ, సర్పంచ్ లలిత, ఉప సర్పంచ్ శ్రీలత, ఎంపీటీసీ నాగేందర్, ఏఎంసీ చైర్మన్ పాపారావు, పీఏసీఎస్ చైర్మన్ శశిధర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు వెంకటేష్, మాజీ ఎంపీపీ చిన్న నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

చిట్టీల పేరిట ఘరానా మోసం

- రూ.7 కోట్లతో ఉడాయించిన మహిళ
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు



వసంత

షాద్‌నగర్ రూరల్: చిట్టీల పేరిట ఓ మహిళ ఘరానా మోసానికి పాల్పడి రూ.7 కోట్లతో ఉడాయించింది. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆదివారం షాద్‌నగర్ పట్టణ సీఐ ప్రతాప్ లింగం ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. పట్టణంలోని పద్మావతి కాలనీకి చెందిన శ్రీనివాస్ షాద్‌నగర్ ఆర్టీసీ డిపోలో క్లర్కుగా పని చేస్తున్నాడు. ఇతని భార్య వసంత 20 సంవత్సరాలుగా చిట్టీల వ్యాపారం చేస్తోంది. సకాలంలో చిట్టీల డబ్బులు చెల్లిస్తూ నమ్మకం పెంచుకుంది. దాదాపు వంద మందితో చిట్టీల పేరిట రూ.7కోట్ల వరకు వసూలు చేసింది. 15 రోజుల క్రితం ఆ డబ్బు తీసుకొని భర్త శ్రీనివాస్‌తో కలసి పారిపోయింది. ఇటీవల ఇంటిని కూడా విక్రయించి సొమ్ము చేసుకుంది. కొన్ని రోజులుగా వసంత కనిపించకపోవడం, ఆమె భర్త శ్రీనివాస్ ఆర్టీసీ విధులకు వెళ్లకపోవడంతో చిట్టీలు వేసిన వారికి అనుమానం వచ్చింది. దీంతో తాము మోసపోయామని గ్రహించి పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మహిళ కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాము కాటుకు బాలుడి మృతి



అనురుధ్(ఫైల్)

నందిగామ: పాము కాటుకు గురై బాలుడు మృతి చెందిన సంఘటన నందిగామలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన జనార్దన్ కుమారుడు అనిరుధ్(5) సాయంత్రం తోటి పిల్లలతో కలసి ఇంటి ముందు ఆడుకుంటున్నాడు. ఈ సమయంలో బాలుడిని పాము కాటు వేసింది. కొంత సమయం తర్వాత బాలుడు జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పాడు. వెంటనే షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. బాలుడి మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

పాతబస్తీలో పనులు పెండింగ్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ట్రాఫిక్ ఇబ్బందుల పరిష్కారం.. సాఫీ ప్రయాణం సాధ్యం కోసం చేపట్టిన పనులు కుంటుతున్నాయి. కొన్ని అసలు ప్రారంభానికే నోచుకోలేదు. అలా నిలిచిపోయిన పనుల్లో పాతబస్తీకి చెందిన పనులూ తక్కువేం లేవు. దాదాపు రూ.2065 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన 856 పనుల్లో పూర్తయినవి కేవలం 269 మాత్రమే. మిగతా 587 పనులు వివిధ దశల్లో ఆగిపోయాయి. వీటిల్లో రోడ్డు నిర్వహణ పనుల నుంచి మొదలు పెడితే ఎన్నో ఏళ్ల క్రితమే ప్రారంభమైన చార్మినార్ పాదచారుల పథకం (సీపీపీ) పనులు కూడా ఉన్నాయి. టెండర్ల దశలో 150 పనులు, పూర్తిగా ఆగిపోయిన పనులు 15, ప్రారంభం కావాల్సిన పనులు 375 ఉన్నాయి.



టాక్‌రాజ్‌గూడలో బోనాల ఊరేగింపు

బోనం.. వైభవం

కడ్తాల్ మండలం రేఖ్యతండా పంచాయతీ పరిధిలోని టాక్‌రాజ్‌గూడలో ఆదివారం పోచమ్మ, మైసమ్మ బోనాలు వైభవంగా జరిగాయి. మహిళలు అందంగా ముస్తాబు చేసిన బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. డప్పు చప్పుళ్లు, యువతి, యువకుల నృత్యాలు, కోలాటాలు, గిరిజన మహిళల సంప్రదాయ నృత్యాలు, పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సర్పంచ్ హరిచంద్‌నాయక్, ఉప సర్పంచ్ జగన్‌నాయక్, నాయకులు హన్మానాయక్, బలరాం నాయక్, బీచ్యానాయక్, రాములు, కృష్ణ, పాండు కోట్యా, రూప్‌సింగ్, రాంచందర్, ధర్మానాయక్, భీమానాయక్, లాల్‌నాయక్ పాల్గొన్నారు.

– కడ్తాల్



నృత్యం చేస్తున్న యువకులు



బోనంతో యువతులు

నారు.. నాణ్యమేనా?

- ప్రభుత్వ అనుమతులు లేకుండానే నారు నర్సరీలు
- పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న వైనం
- నాసిరకం విత్తనాల వినియోగం
- దిగుబడిపై తీవ్ర ప్రభావం
- నష్టపోతున్న రైతులు
- పట్టించుకోని అధికారులు
- ఏటా రూ. వంద కోట్లకుపైగా వ్యాపారం



సాగర్ రోడ్డులోని ప్రైవేట్ నర్సరీలో పెంచుతున్న మిర్చి నారు

యాచారం: ప్రైవేట్ నర్సరీల్లో పెంచే కూరగాయల నారులో నాణ్యతపై రైతుల్లో ఆందోళన నెలకొంది. నారులో నాణ్యత ఉందా.. లేదా అనే విషయం తెలుసుకోకుండానే నాటి దిగుబడి రాక నష్టపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు నర్సరీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారులు పర్యవేక్షించడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. మహానగరం చుట్టూ విస్తరించి ఉన్న రంగారెడ్డి జిల్లాలోని పలు ప్రాంతాల్లో రైతులు వివిధ రకాల కూరగాయల పంటలను సాగు చేస్తారు. ఈ ప్రాంతంలో పండే కూరగాయలను నగరంలో విక్రయిస్తుంటారు. ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, మహేశ్వరం, చేవేళ్ల నియోజకవర్గాల్లో వేలాది ఎకరాల్లో టమాటా, మిర్చి, వంకాయ, సొరకాయ, బెండ, చిక్కుడు తదితర కూరగాయల పంటలను పండిస్తారు. గతంలో రైతులు సొంతంగా నారు పోసుకొనే వారు. కానీ వర్షాలు కురిసే పరిస్థితుల్లో మార్పులు రావడంతో నార్లు పోసుకోవడం మానేశారు. ఇదే అదనుగా భావించిన వ్యాపారులు కూరగాయల నార్ల నర్సరీలను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇటీవల వర్షాలు పడడంతో జిల్లా వ్యాప్తంగా దాదాపు 20 వేల ఎకరాల్లో పలు రకాల కూరగాయల పంటలను పండించేందుకు రైతులు పొలాలను సిద్ధం చేసుకున్నారు.

నారు నర్సరీలతో కోట్ల వ్యాపారం

నారు నర్సరీల ఏర్పాటుతో కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతోంది. తెలుగు రాష్ట్రాల్లోని పలువురు వ్యాపారులు నాగార్జున సాగర్ – హైదరాబాద్, శ్రీశైలం – హైదరాబాద్, కర్నూల్ – హైదరాబాద్, వికారాబాద్ – హైదరాబాద్, విజయవాడ – హైదరాబాద్ మార్గాల్లో పొలాలను రైతుల వద్ద లీజుకు తీసుకుని నర్సరీలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రాంతాల్లో 30కి పైగా నార్లు పెంచే నర్సరీలు ఉన్నాయి. ఎక్కువగా టమాటా, మిర్చి, వంకాయ తదితర నార్లను పెంచుతున్నారు. కొన్ని చోట్ల ఆర్డర్లపై నారు పెంచుతుండగా మరి కొన్ని చోట్ల సీజన్‌ను బట్టి నారు పెంచుతున్నారు. ఒక్కో నారు మొక్కకు రూ. 1.50ల నుంచి రూ. 2వరకు విక్రయిస్తున్నారు. ఒక్కో రైతు కనీసం వెయ్యికి తగ్గకుండా నారు కొనుగోలు చేస్తున్నారు. అయితే నర్సరీల నిర్వహణలో వ్యాపారులు కనీస నిబంధనలు కూడా పాటించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. నాసిరకం విత్తనాలతో నారు పెడుతున్నట్లు తెలిసింది. దీంతో పూత, కాత రాక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఏటా రూ. వంద కోట్లకు పైగానే కూరగాయల నారు విక్రయాలు జరుగుతున్నాయి. నర్సరీ ఏర్పాటు చేయాలంటే కచ్చితంగా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ నుంచి అనుమతులు పొందాలి. కానీ ఎలాంటి అనుమతులు లేకుండా నర్సరీలు ఏర్పాటు చేసి నారు విక్రయిస్తున్నారు.

పూత, కాత రాలేదు



యాసంగిలో రెండు ఎకరాల్లో టమాటా పంట సాగు చేశా. యాచారం – చౌదర్‌పల్లి మధ్య ఉన్న నర్సరీలో ఒక్కో మొక్కకు రూ. 2 చొప్పున 8 వేల మొక్కలను కొనుగోలు చేశా. పూత, కాత రాలేదు. దీంతో రూ. 50 వేలు నష్టపోయా. ఈ విషయాన్ని నర్సరీ నిర్వాహకులకు చెప్పినా వారు పట్టించుకోలేదు. ఉద్యాన శాఖ అధికారులకు కూడా ఫిర్యాదు చేశా.

– రాములు, రైతు, చౌదర్‌పల్లి

అనుమతులు లేవు



ఈ ప్రాంతంలో నారు పెంచే నర్సరీలకు అనుమతులు లేవు. ప్రభుత్వ అనుమతులు పొందిన తర్వాతే నర్సరీలు ఏర్పాటు చేసుకోవాలి. నాసిరకం నారు విక్రయిస్తున్నట్లు రైతుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం. ఇబ్రహీంపట్నం డివిజన్‌లో 5కు పైగా నర్సరీలు ఉన్నట్లు సమాచారం ఉంది.

– కనకలక్ష్మి, ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి

మాట తీరుతోనే గౌరవం

- కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలి
- రాష్ట్ర అడిషనల్ డీజీపీ శివధర్‌రెడ్డి



శివధర్‌రెడ్డిని సన్మానిస్తున్న సంస్థ ప్రతినిధులు

ఇబ్రహీంపట్నం: సమాజంలో గౌరవం పెరగాలంటే మన మాట తీరుపైనే ఆధారపడి ఉంటుందని రాష్ట్ర అడిషనల్ డీజీపీ శివధర్‌రెడ్డి అన్నారు. జ్ఞాన సరస్వతి ఫౌండేషన్, ఎస్పీ స్పోకెన్ ఇంగ్లిష్ అకాడమీ సంయుక్తంగా నిర్వహిస్తున్న వక్త మూడో బ్యాచ్ శిక్షణ శిబిరాన్ని వినోభానగర్‌లోని సాధన కుటీర్‌లో ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శివధర్‌రెడ్డి మాట్లాడుతూ.. మనం మాట్లాడే విధానంతోనే మన గౌరవం పెరుగుతుందని అన్నారు. అందుకే మాట్లాడే విధానాన్ని మెరుగుపరుచుకోవాలని సూచించారు. అంతేకాకుండా ప్రతి రంగంలో రాణించాలంటే కమ్యూనికేషన్ స్కిల్స్ ఎంతో ముఖ్యమన్నారు. అందుకు అనుభవజ్ఞులు, నిపుణల సహాయ సహకారాలు తీసుకోవాలన్నారు. అనంతరం సీనియర్ జర్నలిస్టు రాణి రుద్రమదేవి మాట్లాడుతూ.. వ్యక్తిగా ఎదగాలంటే పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని పెద్దల అనుభవాల నుంచి ఎన్నో అంశాలను నేర్చుకోవాల్సి ఉంటుందన్నారు. నైపుణ్యాభివృద్ధిని మెరుగుపరుచుకుంటేనే ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకులు రవీందర్, స్వదేశీ జాగరణ మంచ్ ప్రతినిధి లక్ష్మణాచార్యులు, ఆర్టీఏ మాజీ కమిషనర్ దిలీప్‌రెడ్డి, జీఎస్ఎఫ్ వ్యవస్థాపకులు సదా వెంకట్‌రెడ్డి, ఎస్పీ స్పోకెన్ ఇంగ్లిష్ అకాడమీ వ్యవస్థాపకులు సంజయ్, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ అధ్యక్షుడు గున్నా రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధరణి సమస్యలు పరిష్కరించండి

- అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



షాద్‌నగర్ రూరల్: ధరణి పోర్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించారు. ధరణి పోర్టల్‌లో చిన్నచిన్న పొరపాట్లు ఉన్నాయని, వాటిని సవరించి రైతుల ఇబ్బందులను తొలగించాలని కోరారు. టీఎం 33 మ్యాడుల్ ప్రకారం రైతులు ఎవరైనా భూమి కోసం మీ–సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకుంటే పోర్టల్ తిరస్కరిస్తోందని తెలిపారు. కొన్ని పట్టా భూములు ఎండోమెంట్ ల్యాండ్‌గా రికార్డుల్లో ఉన్నాయని, అనేక సార్లు అధికారులకు వివరించినా వాటికి పరిష్కారం దొరకడం లేదన్నారు. మాదాసి, మాదారి కురువలకు ఎస్సీ ధ్రువీకరణ పత్రాల పంపిణీ విషయంలో స్పష్టత ఇవ్వాలని, ఇతర ప్రాంతాల్లో వారికి ఎస్సీ సర్టిఫికెట్లను ఇస్తున్నారని తెలిపారు. పరిగి రోడ్డు గుంతలమయంగా మారడంతో ప్రమాదాలు జరిగి ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. రెండు లేన్ల ఈ రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే ప్రశ్నలకు మంత్రి కేటీఆర్ స్పందించారు. ధరణిలోని చిన్నపాటి సమస్యలు తన దృష్టికి వచ్చాయని, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉందని అన్నారు. కలెక్టర్లు, సీసీఎల్ అధికారులతో సమీక్షించి సమస్యలను పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు.

దమ్ముంటే జాతీయ హోదా తెండి



సమావేశంలో మాట్లాడుతున్న రాజావరప్రసాద్

- అభివృద్ధిని చూసి ఓర్వలేకే బీజేపీ, కాంగ్రెస్ ఆరోపణలు
- సహకార కార్పొరేషన్ చైర్మన్ రాజావరప్రసాద్

షాద్‌నగర్ రూరల్: లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టుపై బీజేపీ నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, దమ్ముంటే పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా తీసుకురావాలని సహకార కార్పొరేషన్ చైర్మన్ రాజావరప్రసాద్ సవాల్ విసిరారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాజావరప్రసాద్ మాట్లాడారు. సంక్రాంతి పండుగకు వచ్చే గంగిరెద్దులు, హరిదాసుల్లా బీజేపీ నేతలు గ్రామాల్లో తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీ నేతలు సైనికుల శవాలపై ఓట్లు అడుక్కుంటారని ఆరోపించారు. ఆలయాల పేరుతో కోట్ల రూపాయలు దండుకుంటున్నది మీరు కాదా అని ప్రశ్నించారు. ఉదండపూర్ రిజర్వాయర్ పనులు పూర్తి కాగానే లక్ష్మీదేవిపల్లిని ప్రారంభిస్తామని తెలిపారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. 50ఏళ్ల అధికారంలో ఉన్న కాంగ్రెస్ దేశాన్ని, రాష్ట్రాన్ని ఎందుకు అభివృద్ధి చేయలేక పోయిందన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో ఎంపీపీ ఖాజాఇద్రీస్, మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్, నాయకురాలు రాజ్యలక్ష్మి, కృష్ణవేణి, శంకర్, రవియాదవ్, నర్సింహ, అశోక్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

కుల సంఘాలను విడదీసి రాజకీయాలా?

- కేసీఆర్ పాలనలో అందరికీ కష్టాలే
- బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి బండి సంజయ్



బండి సంజయ్‌ను సన్మానిస్తున్న మున్నూరు కాపు ప్రతినిధులు

కంటోన్మెంట్: తెలంగాణలో ఏ కులం..వర్గం ప్రజలు కూడా సంతోషంగా లేరని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ అన్నారు. మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో సికింద్రాబాద్ రాజరాజేశ్వరి గార్డెన్ ఆవరణలో బండి సంజయ్‌కు ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ కుల సంఘాలను కూడా విడదీసి రాజకీయం చేస్తున్నాడని విమర్శించారు. కులాలు, యూనియన్‌లు, ఉద్యోగులు, కార్మికుల్లో విభేదాలు సృష్టించి పాలన చేస్తున్నారని అన్నారు. స్వార్థపూరిత, కుట్ర రాజకీయాల కోసం కులాలను అడ్డం పెట్టుకోవడం సరికాదన్నారు. కులంతో రాజకీయం చేయడం రాజకీయ నాయకుల లక్షణం కాదని పేర్కొన్నారు. ఆత్మగౌరవం పేరుతో భవనాలు ఇచ్చి ఓట్లు వేయించుకోవడం ఇతర పార్టీలకు అలవాటుగా మారిందన్నారు. హిందూ ధర్మ పరిరక్షణే ధ్యేయంగా..కులాలకు అతీతంగా భారతీయ జనతా పార్టీ కార్యకర్తగా పనిచేశానని అన్నారు. తనను ప్రోత్సహించి బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా అవకాశం కల్పించిన వారికి ధన్యవాదాలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. పేదలను ఆదుకునే విషయంలో మున్నూరు కాపులు ముందుండి అందరికీ ఆదర్శంగా నిలవాలన్నారు. మున్నూరు కాపులకు ప్రశ్నించే ధైర్యం ఉంటుందని కొనియాడారు. ఏ కులమైనా అందులో ఉన్న పేద ప్రజల గురించి ఆలోచించి.. వారిని ఏ విధంగా ఆదుకోవాలనే అంశంపై దృష్టి సారించాలన్నారు. కనీస మౌలిక సదుపాయాలు, ఇల్లు లేక ఎంతోమంది పేద ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కుల సంఘాలు ఆర్భాటాలకు పోకుండా సరైన పద్ధతిలో పనిచేసి పేదలను ఆదుకోవాలన్నారు.

ఎంఐఎం, బీఆర్ఎస్ ఒక్కటే..

ఎంఐఎం, బీఆర్ఎస్ పార్టీలు రెండూ ఒక్కటేనని బండి సంజయ్ అన్నారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతాడని ఎంఐఎం నేత అక్బరుద్దీన్ అసెంబ్లీ సాక్షిగా చెప్పడమే ఇందుకు నిదర్శనమన్నారు. తెలంగాణలో కుటుంబ పాలన అంతం కావాలని, సామాన్యులు రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించాలన్నారు.

వేర్వేరు కేసుల్లో బంగారం పట్టివేత

శంషాబాద్: మూడు వేర్వేరు కేసుల్లో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులు రూ.2.29 కోట్ల విలువైన బంగారం స్వాధీనం చేసుకున్నారు. శనివారం అర్ధరాత్రి జెడ్డా నుంచి వచ్చిన ఇద్దరు వేర్వేరు ప్రయాణికులను తనిఖీ చేయగా ఓవ్యక్తి ఐరన్‌బాక్సులో తీసుకొచ్చిన రూ.36.41 లక్షల విలువ చేసే 594 గ్రాముల బంగారం బయటపడింది. మరో వ్యక్తి పోర్టబుల్ స్పీకర్‌లో దాచుకుని తీసుకొచ్చిన బంగారంతో పాటు బంగారం పేస్టును క్యాప్సుల్స్‌గా చేసి మలద్వారంలో తీసుకొచ్చాడు. అతడి నుంచి రూ.75 లక్షల విలువ చేసే 1225 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. శనివారం అర్ధరాత్రి దుబాయ్ నుంచి వచ్చిన ప్రయాణికుడిని కస్టమ్స్ అధికారులు తనిఖీ చేయగా లోదుస్తుల్లో పేస్టు రూపంలో కేజీ 924 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.1.18 కోట్ల విలువ ఉంటుందని నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిలోఫర్‌లో దారుణం

- మూడు రోజుల శిశువుపై వ్యక్తి పడడంతో మృతి
- ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన

నాంపల్లి: నవజాత శిశు సంరక్షణా కేంద్రం నిలోఫర్‌లో అపశృతి చోటుచేసుకుంది. రోగి సహాయకుడు మీద పడటంతో మూడు రోజుల మగ శిశువు మృతి చెందాడు. ఈ సంఘటన నిలోఫర్ ఆసుపత్రి అత్యవసర సేవల విభాగంలో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న ఆసుపత్రి సిబ్బంది గుట్టు చప్పుడు కాకుండా శిశువు మృతదేహాన్ని హుటాహుటిన ఆసుపత్రి గేట్లు దాటించేశారు. దీంతో శిశువు బంధువులు ఆసుపత్రి ఎదుటే ఆందోళనకు దిగారు. ఆసుపత్రి సిబ్బంది పండంటి మగ శిశువును పొట్టనపెట్టుకున్నారని బోరున విలపించారు. న్యాయం చేయాలని బాధితులు పట్టుబట్టడంతో అక్కడ కాసేపు తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. శిశువు మృతికి కారణమైన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు సర్దిచెప్పడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. పరిగి ప్రాంతానికి చెందిన పుష్పమ్మ అనే మహిళ మూడు రోజుల క్రితం పండంటి మగ శిశువుకు జన్మనిచ్చింది. ఆమెకు ఒకటిన్నర కేజీల బరువు ఉన్న శిశువు జనిృంచడంతో పరిగి ప్రభుత్వాసుపత్రి వైద్యులు నిలోఫర్ ఆసుపత్రికి మెరుగైన వైద్య సేవల నిమిత్తం తీసుకెళ్లాలని సూచించారు. వైద్యుల సూచనల మేరకు బంధువులు మగ శిశువును రెండు రోజుల క్రితం రెడ్‌హిల్స్‌లోని నిలోఫర్ ఆసుపత్రికి తీసుకు వచ్చారు. ఎన్ఐసీయూ ఇంక్యుబేటర్‌లో చికిత్స పొందుతుండగా వార్డులోని రోగి సహాయకుడు ఒకరు ఆదివారం ఉదయం ప్రమాదవశాత్తు కాలుజారి శిశువు మీద పడ్డాడు. దీంతో ఆ శిశువు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం శిశువు మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాధితుల అరెస్టు దారుణం



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: బడంగ్‌పేటలోని దావుత్‌ఖాన్‌గూడలో 'మా భూమి మాకు కావాలి' అని నిరసన దీక్షలు చేస్తున్న దళిత కుటుంబాలను మీర్‌పేట పోలీసులు అర్ధరాత్రి ఇళ్లలోకి దూరి అరెస్ట్ చేసి ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న బడంగ్‌పేట మేయర్, పీసీసీ ప్రధాన కార్యదర్శి చిగురింత పారిజాత ఆదివారం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎవరూ అధైర్య పడొద్దని భరోసా కల్పించారు. స్టేషన్ హౌస్ అధికారితో పాటు వనస్థలిపురం ఏసీపీతో మాట్లాడారు. త్వరగా అరెస్టైన దళిత కుటుంబాలను వదిలిపెట్టాలని కోరారు. కబ్జాదారులను వదిలిపెట్టి బాధితులను అరెస్ట్ చేసి వేధింపులకు గురిచేయడం దారుణమని ఆరోపించారు. కార్యక్రమంలో పీసీసీ ప్రొటోకాల్ మెంబర్ బంగారు బాబు, ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గం అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి, తదితరులున్నారు.

పేదలకు అండగా ఉంటా



బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం చేస్తున్న మల్లేశ్

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మల్లేశ్

యాచారం: ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని పేద ప్రజలకు అండగా ఉంటానని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేష్ పేర్కొన్నారు. మండలంలోని మొండిగౌరెల్లి, తక్కళ్లపల్లి, తాడిపర్తి తదితర గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించి రూ. 10 వేల చొప్పున, ఐదు కుటుంబాలకు రూ. 50 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో నేటికి అంత్యక్రియలు చేయలేని దుస్థితిలో ప్రజలు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి పేద కుటుంబాలకు అండగా ఉంటానని చెప్పారు. ప్రజా సేవ చేయడంలో ఎంతో తృప్తి ఉందని చెప్పారు. బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి భాషా, సీనియర్ నాయకుడు యాదయ్య, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

తలకొండపల్లి: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ వెంకటేష్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని సంఘాయిపల్లి గేట్ వద్ద ఆదివారం అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న టిప్పర్‌ను పోలీసులు పక్కా సమాచారంతో అదుపులోకి తీసుకొని డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలో కలపాలి



ఉద్యోగ సంఘ సమీక్ష సమావేశానికి హాజరైన ముదిరాజ్‌లు

ఇబ్రహీంపట్నం: ముదిరాజ్ కులస్తులను బీసీ ఏ గ్రూప్‌లో కలపాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కావాలి వెంకటేశ్, నియోజకవర్గ అధ్యక్షుడు గంట భిక్షపతి అన్నారు. ముదిరాజ్ ఉద్యోగ సంఘం నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం యారకృష్ణ అధ్యక్షతన ఆదివారం ఇబ్రహీంపట్నంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్థిక, రాజకీయ, విద్యాపరంగా ముదిరాజ్ కులస్తులు వెనుకబడి ఉన్నందున బీసీ డీ నుంచి ఏ లోకి మార్చాలని డిమాండ్ చేశారు. చట్టసభల్లో జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్లు అమలు చేయాలని, పది లక్షల ముదిరాజ్ బంధును అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సత్తయ్య, ఉద్యోగ సంఘాల నాయకులు బాస్కర్, అశోక్, వెంకటేశ్,మురళి, లింగం, శ్రీను, కృష్ణ, సత్యనారాయణ, రమేష్, బాలరాజులు పాల్గొన్నారు.

సమస్యలకు నిలయంగా కస్తూర్బాగాంధీ



పాఠశాలకు వెళ్లే మట్టి రోడ్డు



ప్రహరీ లేని కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాల

శంకర్‌పల్లి: శంకర్‌పల్లిలోని కస్తూర్బాగాంధీ పాఠశాల సమస్యలకు నిలయంగా మారింది. పాఠశాల శంకర్‌పల్లి పట్టణ కేంద్రానికి రెండు కిలో మీటర్ల దూరంగా నిర్మించడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉంది. దీనికి తోడు పాఠశాలకు వెళ్లే రోడ్డు పూర్తిగా బురద, గుంతలమయంగా ఉండటంతో అటువైపు ఎవరు వెళ్లాలన్నా ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుంది. పాఠశాలకు ప్రహరీ పూర్తిగా లేకపోవడంతో రాత్రి సమయంలో భయం గుప్పిట్లో గడుపుతున్నారు. పాఠశాలలో మంచి నీటి సమస్య తీవ్రంగా ఉంది. నీటిని ట్యాంకర్ల ద్వారా పోయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పాఠశాల గదులకు కనీసం కిటికీలు కూడా సక్రమంగా లేవు. దీంతో విద్యార్థినులు చలికి ఇబ్బందులు పడుతున్నారు. కాగా, పాఠశాల ఆవరణలో పెద్ద గుంత ఉండటంతో దానిలో నీరు నిండి దోమలు ప్రబలుతున్నారు. పాఠశాల పక్కనే హైటెన్షన్ విద్యుత్ వైర్లు ఉండటంతో ప్రతి రోజు రాత్రి సమయంలో రేడియేషన్ సమస్య కూడా ఉంది. పాఠశాలలో మొత్తం 380మంది విద్యార్థినులు ఉండగా 15మంది ఉపాధ్యాయులు విధులను నిర్వర్తిస్తున్నారు.

పోలీసులు గస్తీ నిర్వహించాలి

పాఠశాల పట్టణానికి దూరంగా ఉండటంతో విద్యార్థినులు తీవ్ర భయాందోళనలో ఉన్నారు. దీనికి తోడు పాఠశాల పరిసరాలల్లో ఆకతాయిలు మద్యం సేవిస్తున్నారు. పాఠశాల పరిసరాలల్లో పోలీసులు గస్తీ నిర్వహించాలని ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఉపాధ్యాయులు తెలిపారు. ఇప్పటికైనా పోలీసులు గస్తీ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పాఠశాల పక్కనే ఉన్న హైటెన్షన్ స్తంభం

గుట్కా తయారీ కేంద్రంపై దాడులు

పహాడీషరీఫ్: బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నకిలీ గుట్కాలను తయారు చేస్తున్న కేంద్రంపై ఆదివారం మహేశ్వరం జోన్ ఎస్ఓటీ పోలీసులు దాడులు నిర్వహించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాకుత్‌పురా గంగానగర్‌కు చెందిన మహ్మద్ అక్బర్(49) మరో యువకుడితో కలిసి షాహీన్‌నగర్‌లోని ప్యారడైజ్ ఫంక్షన్‌హాల్ వెనకాల కొన్ని రోజులుగా నకిలీ గుట్కాలను తయారు చేస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఎస్ఓటీ పోలీసులు శనివారం రాత్రి దాడులు నిర్వహించి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.15 లక్షల విలువైన సాగర్ పాన్ మసాల, అంబర్ పొగాకు, జర్దా ముడిసరుకు, తయారీ మిషన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను తదుపరి విచారణ నిమిత్తం బాలాపూర్ పోలీసులకు అప్పగించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న ముడిసరుకు

ఎమ్మెస్సీ డాటా సైన్స్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో కొత్తగా ప్రవేశపెట్టిన ఎమ్మెస్సీ డాటా సైన్స్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు ఈ నెల 8 నుంచి 17 వరకు, రూ.500 అపరాధ రుసముతో 19 వరకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని పీజీ టీఎస్‌పీజీఈటీ–2023 కన్వీనర్ ప్రొ.పాండురంగారెడ్డి తెలిపారు. ఓయూ, తెలంగాణ మహిళ విశ్వవిద్యాలయంలో 2023–24 విద్యా సంవత్సరానికి ప్రవేశపెట్టిన ఎమ్మెస్సీ డాటా సైన్స్ కోర్సులో ఎంట్రన్స్ టెస్ట్ ద్వారా ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలిపారు. వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్ చూడవచ్చు.

కాలం చెల్లిన మందు విక్రయం



ఆయింట్‌మెంట్ పై ఉన్న గడువు తేదీ



మెడికల్‌షాపులో కొనుగోలు చేసిన ఆయింట్‌మెంట్

చేవెళ్ల: మండల కేంద్రంలోని పట్నం మహేందర్‌రెడ్డి జనరల్ ఆస్పత్రిలో కాలం చెల్లిన మందులు విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఓ వ్యక్తి ఆరోపించాడు. మండలంలోని పట్నం మహేందర్‌రెడ్డి ఆస్పత్రికి రెండు రోజుల కిత్రం చేవెళ్లకు చెందిన ఓ వ్యక్తి తన రెండేళ్ల కొడుకుకు చర్మ సమస్య ఉందని వెళ్లారు. వైద్యులను సంప్రదించగా మందులు రాసి ఇచ్చారు. దీంతో అక్కడే ఉన్న మెడికల్‌షాపులో మందులు తీసుకొని ఇంటికి వెళ్లి పరిశీలించగా గత రెండు నెలల కిత్రమే ఎక్స్‌పైర్ అయినట్లు ఉంది. దీంతో వెంటనే ఆస్పత్రి ఇన్‌చార్జి వినోద్‌రెడ్డికి ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. సోమవారం తనిఖీ నిర్వహించి చర్యలు తీసుకుంటామని వినోద్‌రెడ్డి తెలిపారు. ఉన్నత వైద్యాధికారులు మెడికల్ దుకాణాలపై తనిఖీలు నిర్వహించి పేద ప్రజల ఆరోగ్యాలకు రక్షణ కల్పించాలని కోరారు. దీనిపై ఆస్పత్రి ఇన్‌చార్జి వినోద్‌రెడ్డిని సాక్షి సంప్రదించగా అవును ఈ విషయం తన దృష్టికి ఉదయమే బాధితుడు ఫోన్‌లో చెప్పాడని తెలిపాడు. ఆస్పత్రిలోని మెడికల్ షాపులో తనిఖీ చేయించి కాలం చెల్లిన మందులు ఉంటే తొలగిస్తామని తెలిపారు.

ఎస్ఐ ఫలితాల్లో కడ్తాల్ సంచలనం



కడ్తాల్: సివిల్ ఎస్ఐగా నార్లకంటి శ్రీశైలం



కడ్తాల్: సివిల్ ఎస్ఐగా గౌర శ్రీకాంత్



కడ్తాల్: సివిల్ ఎస్ఐగా గజ్జె లింగంగౌడ్



కడ్తాల్: సివిల్ ఎస్ఐగా చిందం శ్రీను



కడ్తాల్: ఏఆర్ ఎస్ఐగా మునేశ్‌నాయక్



కడ్తాల్: ఏఆర్‌ఎస్ఐగా మంఖాల సునీల్‌గౌడ్



ఎస్ఐ పోస్టుకు ఎంపికైన ఎండీ సోహల్



సునీత



డానియేల్

కడ్తాల్: టీఎస్ఎల్‌పీఆర్‌బీ ఆదివారం విడుదల చేసిన ఎస్ఐ తుది ఫలితాల్లో కడ్తాల్ మండలానికి చెందిన పలువురు యువకులు ఎస్ఐ ఉద్యోగానికి ఎంపికయ్యారు. మండల కేంద్రానికి చెందిన నార్లకంటి రాంచంద్రయ్య సాలమ్మ దంపతుల కుమారుడు నార్లకంటి శ్రీశైలం సివిల్ ఎస్ఐగా ఎంపికయ్యారు. ప్రస్తుతం శ్రీశైలం అగ్నిమాపక శాఖలో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. అలాగే, కడ్తాల్‌కు చెందిన మంకాల శ్రీనివాస్‌గౌడ్ కుమారుడు సునీల్‌గౌడ్ ఏఆర్ఎస్ఐగా ఎంపికయ్యారు. మండల పరిధిలోని గానుగుమార్ల తండాకు చెందిన నర్సింగ్, సాలి దంపతుల కుమారుడు మునేశ్‌నాయక్ ఏఆర్ ఎస్ఐగా ఎంపికయ్యారు. చరికొండ గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు సివిల్ ఎస్ఐలుగా ఎంపికయ్యారు. చరికొండకు చెందిన జంగమ్మ కుమారుడు గౌర శ్రీకాంత్ , గజ్జె ముత్యాలు కుమారుడు లింగంగౌడ్, చిందం బీరయ్య కుమారుడు చింద శ్రీను సివిల్ ఎస్ఐగా ఎంపికయ్యారు. ఒకేసారి మండలంలో పెద్ద సంఖ్యలో యువకులు ఎస్ఐ ఉద్యోగం సాధించడం పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆమనగల్లు: తెలంగాణ ప్రభుత్వం ఆదివారం విడుదల చేసిన ఎస్ఐ ఫలితాల్లో ఆమనగల్లుకు చెందిన ఉప్పల పర్వతాలు, మణమ్మల కుమార్తె ఉప్పల సునీత ఎస్ఐగా ఎంపికైంది. గతంలో సునీత పోలీసు కానిస్టేబుల్‌గా ఎంపికైనప్పటికీ ఎస్ఐగా ఎంపిక కావాలని లక్ష్యంతో కానిస్టేబుల్ ఉద్యోగం వదులుకుంది. రెండవ ప్రయత్నంలో అరమార్కుతో ఎస్ఐ ఉద్యోగం కోల్పోయింది. తిరిగి మూడవ ప్రయత్నంలో ఎస్ఐగా ఎంపికైంది. ఈ సందర్భంగా సునీతను పలువురు అభినందించారు.

ఎస్ఐ పోస్టుకు ఎంపికైన మాల్ యువకుడు

యాచారం: ప్రభుత్వం ఆదివారం విడుదల చేసిన ఎస్ఐ ఫలితాల్లో యాచారం మండలం మాల్ గ్రామానికి చెందిన ఎండీ సోహల్ సివిల్ ఎస్ఐ పోస్టుకు ఎంపికయ్యాడు. ఎండీ గౌసియాబేగం, అబ్దుల్ సత్తార్ రెండో కుమారుడైన ఎండీ సోహల్‌కు 2018లో రైల్వేలో ఉద్యోగం వచ్చింది. ఎస్ఐ పోస్టుపై మమకారంతో కష్టపడి చదివి సివిల్ ఎస్ఐగా ఎంపికయ్యాడు.

ఎస్ఐ పీటీఓ పోస్టు సాధించిన డానియేల్

కందుకూరు: మండలంలోని లేమూరుకు చెందిన చింతకింద డానియేల్ పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ (పీటీఓ) పోస్టు సాధించాడు. ఎస్ఐ మెయిన్స్ పరీక్షా ఫలితాలు ఆదివారం సాయంత్రం విడుదలైయ్యాయి. ఫలితాల్లో డానియేల్ సెలెక్ట్ అయ్యాడు. కాగా, డానియేల్‌కు ఇటీవల సౌత్ సెంట్రల్ రైల్వేలో పాయింట్స్ మెన్‌గా సైతం ఉద్యోగం రాగా, ప్రస్తుతం రెండు నెలల నుంచి ఉద్యోగం చేస్తున్నాడు. ప్రస్తుతం సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టు సాధించడంతో అతని కుటుంబం సంతోషంలో మునిగిపోయింది. డానియేల్ అన్న రాజ్‌కుమార్ పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఐటీ విభాగంలో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. ముగ్గురు అక్కల్లో ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లుగా, ఒకరు కానిస్టేబుల్‌గా, మరో అక్క ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సుగా విధులు నిర్వర్తిస్తుంది.